

# ఆశ్రయం

మధురాంతకం రాజారాం

**రాయలసీమ ఎక్స్‌ప్రెస్ హైద్రాబాదు శివార్లను అందుకునేటప్పటికి బాగా తెల్లవారిపోయింది.**

**రాత్రివేళ నడిచే బండి కావడంవల్ల, అందులో ప్రయాణం పర్వత సొరంగంలో దూరి వెళ్ళినట్టే వుంటుంది.**

మసక చీకట్లు విచ్చిపోయినప్పటి నుంచీ నాకు గుర్తు

దిక్కుల అంచులదాకా పరచుకున్నట్టున్న నల్లరేగటి పొలాలు వృక్ష సంతతి చాలా నక్పుత్తు కొన్ని కొన్నిచోట్ల దాదాపు 'నిల్' అనే చెప్పొచ్చు విస్తీర్ణంలో ఎకరాకు తగ్గని పెద్ద పెద్ద కయ్యలు, ఎత్తయిన గట్లు, ఉండీ వుడిగీ వరి, జొన్న, హైబ్రీడ్ పశుగ్రాసం, కొర్ర, ఆరికలాంటి పైర్లతో ఒకటో అరో పచ్చని చెట్లు, ఇవన్నీ మనుషులు నివసిస్తున్నా రనుకోడానికి దాఖలాలే! కానీ ఎక్కడ నక్కి కూర్చున్నాయో మరి, ఆ మనుషులు నివసించే పల్లెలుగానీ, పేటలుగానీ కనుచూపు మేరలో కానరావడంలేదు జలప్రళయం తరువాత మానవ జాతి అభివృద్ధి కావడంకోసం మిగిలిన నమూనాలకు మల్లే ఏ రెండు మైళ్ళకో, మూడుమైళ్లకో ఒక చోట కాడి భుజాన మోసుకుంటూ ఎద్దుల్ని పొలానికి తోలుకెళ్లే ముసలిరైతు, ఎరువు తట్ట తలకెత్తుకుని గనుమవెంట సాగివెళ్ళే ఆడమనిషి, మడుగునుంచీ బర్రెగొడ్డును ఈవలికి లాగుతున్న కుర్రవాడు — యిలా మనుషులు అరుదుగా కనిపించి, అంతలో మటుమాయమవుతున్నారు పగ్గాలులేకుండా ఎండలు కాసినప్పుడు, ఉన్నట్టుండి జడివానలు ముంచుకొచ్చినప్పుడు వీళ్లెక్కడ తలదాచుకుంటారు? బరాబయలు ప్రకృతి నడుమ మానవుడెంత నిస్సహాయుడో?

జనాలూ, జనావాసాలూ కనిపించని కొరత రైలుబండి నగరం పొలిమేరల్లోకి చొచ్చుకుపోయేటప్పటికి యిబ్బడి ముబ్బడిగా తీరిపోయింది పుడమి కడుపును చీల్చుకుంటూ ఆకసంవైపు లేచినట్టు రకరకాల కట్టడాలు ఒంటరిగా చిన్న కోటల్లాంటివి కొన్ని ఖార్ఖానాలు నడపడం కోసం ఉద్దేశించినవి కొన్ని శిథిలావస్థలో కొన్ని సరికొత్తవి కొన్ని సజీవులూ నిర్జీవులూ కలిసి సహజీవనం చేస్తున్నట్టుగా ఆకట్టడాలకు మధ్య సమాధులూ, ఘోరీలూ కొన్ని సిటీ యిలా ప్రారంభమైపోయింది చీరకైనా పంచెకైనా సొబగుచేకూర్చేవి వాటి అంచులే నగరం శివార్లలోని మురికి వాడలందుకు విరుద్ధం చెత్తా చెదారంతోనూ, పెంటకుప్పలతోనూ, మురికి కాలవలతోనూ నిండి ఆది వైతరణీ నదీతీరంలో యాతనా జీవుల కోసం వేసిపెట్టిన గుడారాల్లా వుంటాయి అలాంటి మురికివాడల వీధులవెంట ఎందరో వ్యక్తులు చీమలబారుల్లా కదులుతూ కొందరు, కూరగాయల అంగళ్ల ముందర ఈగల్లా ముసిరి కొందరు, టీకొట్లల్లో గొంతు తడుపుకుంటూ కొందరు, నీటి పంపుల దగ్గర ఖాళీ బిందెల పోరాటం సల్పుతూ కొందరు తమ నిత్యకృత్యాల రొటీనుకు ఉపక్రమిస్తున్నారు ఏమైనా నగరవాసుల్లో ఒక సుగుణమున్నట్టు నాకు తోచింది పాపం తమ గొడవేదో తమది నగరాభిముఖంగా పరతెంచి వచ్చే క్రిక్కిరిసిన రైళ్లనుగానీ, బస్సులనుగానీ వాళ్లు పట్టించుకోరు చూచినా చూడనట్టే వుంటారు తెప్పలుగా నిండిన చెరువులోకి కొన్ని కప్పలు కొత్తగా వచ్చి చేరినట్టుగా వేలకొలది మంది ఆగంతుకులు పట్నంలో దిగబోతున్నారన్న ఊహ గూడా వాళ్లకు కలిగేటట్టులేదు ఇదంతా వాళ్లకు బాగా అలవాటైపోయినట్టుంది

గమ్యస్థానం చేరువకు వస్తిన కొద్దీ నేను కూర్చున్న రెండో తరగతి రిజర్వుడు కంపార్టుమెంటులో సంచలనం పుంజుకుంటూ వచ్చింది

'ఎల్లలోకములొక్కయిల్లై' అని ఒక మహానుభావుడు అన్నాడు కానీండి, అది వట్టి ఆదర్శం మాత్రమే! వ్యవహార సరళికి అడ్డుగోడలు తప్పని సరి! అడ్డుగోడలు లేకపోతే కంపార్టుమెంటులో యిన్ని అరలుండేవీ కాదు, ఇన్ని బెర్తులు ఏర్పాటు చేయడానికి వీలుండేదీ కాదు అరలో నాతో బాటుగా వచ్చిన ప్రయాణీకులు పెట్టేలూ బట్టలూ సర్దుకుంటూ వీడ్కోలు మాటలు పలుక్కుంటున్నారు. అందులో ఒక బొద్దు మీసాల ఆసామి కోడూరులో రైలెక్కాడు కుమార్తె హైదరాబాద్‌లో వుందండి అల్లుడు ఒక ప్రయివేట్ ఫర్మ్‌లో సేల్సు రెప్రజెంటేటివు వంజగుట్ట పోలీసుస్టేషనుకు అరమైలు దూరంలో జర్నలిస్టుల కాలనీ దాపున ఒక యింట్లో అతడి నివాసం. వెళ్లడానికి ఆటో వుంది సత్కారాలు నెరపడానికి కూతురుంది. గౌరవించడానికి అల్లుడున్నాడు నాకేం కొదవ అన్న ధీమా ఆయన ముఖంలో చిందులాడుతూ వుంది ఇంకొకాయన పొద్దుటూరులో పెద్ద బట్టల వ్యాపారి హైదరాబాదుకు రాకపోకలు సల్పడమంటే ఆయనకు కొట్టిన పిండిలా వుంది వాడుకగా సుల్తాన్ బజారులోని హోల్‌సేల్ మండీల్లో బట్టలు కొంటూ వుంటాడట సదరు బట్టల షాపుల షావుకార్లు ఆయనకు బస ఏర్పాటు చేసి, భోజన సదుపాయాలు కల్పించి, తిరుగు ప్రయాణానికి టికెట్టు గూడా రిజర్వు చేయించి, టాక్సీలో తీసుకొచ్చి స్టేషనులో దిగబెడతారట! బట్టతల ప్రయాణీకుడొకాయన చెదరని గంభీర ముద్రదాల్చి, లోకం సంగతి తనకేమీ బట్టనట్టు ప్రయాణం పొడుగునా వీలయినంత ముభావంగా కూర్చున్నాడు ఒకానొక యూనివర్సిటీలో సోషియాలజీ రీడరుగా వుంటూ ఆయన 'ఉస్మానియా'లో ఒక 'వైవా' నిర్వహించడం కోసం వెళ్తున్నాడట! ఆయనకేమబ్బా, అదృష్టవంతుడు! మకాం పెట్టడానికి యూనివర్సిటీ గెస్ట్‌హవుసు అడుగులకు మడుగులొత్తడానికి రేసెర్చిస్కాలర్లు!

ఎటొచ్చీ హైదరాబాదు నగరంలో ఆశ్రయాన్ని గురించి నాకున్నన్ని అనుభవాలు వాళ్లకెవరికీ వున్నట్టులేవు రాష్ట్రానికి దక్షిణపు సరిహద్దు జిల్లాలో ఒక మారుమూల గ్రామానికి చెందిన వాడినైనా నాకు ఏడాదికి కనీసం ఒకసారైనా ముఖ్య నగరంతో పని తగులుతూ వుంటుంది సిటీలో అనువైన ఆశ్రయాన్ని సంపాదించడం కోసం నేను మొదట మొదట వివిధ ప్రయోగాలు చేసి చూశాను చిక్కడపల్లిలో మాకు దగ్గరి బంధువులున్నారు కొన్ని పర్యాయాలు అతిథిగా వాళ్ల యింట్లో దిగాను పులి మేదనేగదండి పుట్ట! ఒక పెళ్లి వ్యవహారం మూలంగా వాళ్లకూ మాకూ కొంచెం బెడిసింది రాకపోకలు బందయిపోయాయి అంతటితో చిక్కడపల్లి మాట కట్టిపెట్టేశాను మలక్‌పేట కాలనీలో యింకొక కుటుంబం వుంది బంధుత్వం కన్నా ఆ కుటుంబానికి చెందిన అన్నదమ్ములిద్దరితోనూ నాకూ స్నేహమే హెచ్చు ఉద్యోగరీత్యా వాళ్లు దక్షిణాది నుంచీ హైదరాబాదుకు వచ్చి స్థిరపడి చాలా కాలమైంది అరమరికలు లేకుండా నాకాతిథ్యం యివ్వాలన్న సంకల్పం స్నేహితుల కున్నప్పటికీ, ఆయింటి గృహిణులకు మాత్రం ఎంత కాలమైనా నేను పరాయివాణ్ణిగానే కనిపిస్తూ వచ్చాను ఒకసారి గౌలిగూడా బస్ స్టేషనులో దిగి, రిక్షాచేసుకుని కాలనీకివెళ్తే వాళ్లు "మగవాళ్లింట్లో లేరండీ! కావాలిస్తే లగేజీ యింట్లోపెట్టి వెళ్లండి" అన్నారు నాకు లభించని మర్యాద నా లగేజీకి దక్కడం నాకిష్టం లేదు అందువల్ల వెనుదిరిగి చూడకుండా తిరుగుదారిపట్టాను హైస్కూలుదాకాసహాధ్యాయి అయిన ఒక మిత్రుడు నారాయణగూడాలో కాపురముంటున్నాడు ఒక కంచాన తిని ఒక మంచాన పడుకున్నవాళ్లమే! కానీ ఒక గొప్ప యింటి ఆడపడుచు భారీ కట్నంతో అర్ధాంగి కావడం వల్ల అతడి స్టేటస్సు పూర్తిగా మారిపోయింది చిన్న కోర్టులంటే ముఖం మొత్తి, కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలన్న పూనికతో హైదరాబాదు వచ్చి హైకోర్టులో ప్రాక్టీసు చేస్తున్నాడు ఒకసారి పనిగట్టుకుని అతణ్ణి వెదుక్కుంటూ వెళ్తే—క్లయింట్లతో మాట్లాడుతూ నన్నొక గంటసేపు వెయిటింగురూములో కూచోబెట్టి, ఆ తర్వాత క్లుప్తంగా ఒక కాఫీ యిప్పించి "దగ్గర్లోనే ఒక హోటలుంది రూము దొరకడం కష్టం అయినా ప్రొప్రయిటరు నాకు తెలిసినవాడు నేను ఫోను చేస్తే దొరక్కపోదు" అన్నాడు అద్దె గురించి అడిగాను "ఎంతో వుండదు రోజుకు యాభై రూపాయలే" నన్నాడు ఆపైన నారాయణగూడా వైపు తిరిగి చూచివుంటే ఒట్టు! ఇంకొక మిత్రుడు సంతోషనగర్ నివాసి నాలాగే కొంచెం కథలూ, కాకరకాయలూ రాసే పిచ్చికద్దు! మంచి ఉద్యోగం చేస్తున్నాడు అతడి వెంట ఒకటి రెండుసార్లు సంతోషనగర్ కాలనీ దర్శించాను వెళ్లిన తర్వాత సంతోషం లభించే మాట నిజమే గానీ, అక్కడికి వెళ్లడం మాత్రం ప్రయాసతో గూడిన పని బస్సుల కోసం పడిగాపులు పడాలి మూడు బస్సులు మారి ఏడెనిమిది మైళ్లదూరంవెళ్లాలి మళ్లీ ఉదయం తొమ్మిందింటికి నేను నా సమావేశానికి హాజరు కావాలంటే ఆ వేళప్పుడు బస్సులుండవు ఆటో వాడు తానంతదూరం రానంటాడు ఈ బాదరబందీ అంతా. ఎందుకని సంతోషనగర్‌ను గూడా నా జాబితాలో నుంచీ తీసేశాను ఏ విధంగా చూచినా హైదరాబాదులో నాకింక హోటలు గదే శరణ్యమనిపించింది పల్లెలో ఒక కుటుంబానికి నెలకంతా కలిపి యిచ్చేటంత బాడుగ నగరంలో ఒక మనిషి ఒక రోజుకే యివ్వవలసి వస్తున్నదన్నదే నా బాధ ఒక వస్తువు యొక్క లేదా ఒక సదుపాయం యొక్క విలువ దేశాన్ని బట్టీ కాలాన్ని బట్టీ మారుతుందని మార్క్సులాంటి మహనీయుడెవరైనా చెప్పాడో లేదో నాకు తెలియదు ఆ మాటకేంగానీ, రిక్షావాడు నన్ను మూసీ నది ఒడ్డున వున్న ఒక లాడ్జికి తీసుకెళ్లాడు పాతిక రూపాయలకొక గది దొరికింది దానికి కిటికీలుగానీ,, వెంటిలేటర్లుగానీ లేవు రెక్క తలుపులు మూసి గడియపెడితే పర్‌ఫెక్టు ఇనప్పెట్టె సబ్ మెరీన్‌లో ప్రయాణం చేస్తే అలాంటి అనుభూతి కలుగుతుందేమో! ఆ త్రిశంకుడి స్వర్గం కంటె లగేజిని క్లోక్‌రూంలో పడేసి, స్టేషనులో ఒక బెంచీపైన పడుకోవడం దేవేంద్ర భోగంలా ఉంటుందనిపించింది మరునాటి ఉదయం మంచి లాడ్జికోసం అన్వేషిస్తూ వీధులవెంట చెడ తిరిగేశాను, వసతి బాగుంటే అందుకు తగ్గ ఆర్థిక స్తోమత మనకుండదు ఆర్థికంగా అందుబాటులో వుంటే అక్కడ వసతులు తృప్తికరంగా వుండవు కొన్ని గంటలపాటు నీటి ఆవిరిలో నిండిన నీరెండలో తిరిగేటప్పటికి కాగే నీటిలో పడవేసిన చిలగడ దుంపలా శరీరం వుడకిపోయింది వేసుకున్న దుస్తులు చెమటతో తడిసిపోయాయి, ఏం చేయాలో తోచక నిస్సహాయంగా ఒకచోట పేవ్‌మెంటుపైన నిల్చున్నాను అట్టి పరిస్థితిలో వరదలో కొట్టుకుపోతున్న వాడి చేతికి తెడ్డు కొయ్య దొరికినట్టుగా, కారు చీకటిలో కాంతి పుంజం ఒకటి కనిపించినట్టుగా, రెండు స్నేహ హస్తాలు అమాంతంగా నన్ను కౌగలించుకుని ఉక్కిరి బిక్కిరి చేసి పారేశాయి

"ఏమండీ రాజశేఖరంగారూ! బాగున్నారా? అబ్బ, ఎంతకాలానికి కనిపించారండీ! ఎప్పుడొచ్చారు హైదరాబాదు? హైదరాబాదుకొస్తే నేనొకణ్ణి వున్నానని మీరు మరిచే పోయారా?"

పరామర్శలన్నీ ముగిసేలోగా అప్పటి నా పరిస్థితినంతా ఆతడు కుణ్ణంగా ఆకళించుకోగలిగాడు "ఏమిటండీ మీరు మరీనూ! ఒకటి రెండు రోజులు సిటీలో స్టే చేయడంకోసం యింతగా యిబ్బంది పడిపోతారా? వదిలేయండి మీకా బెంగేవద్దు హోటలు రసీదు, తాళంచెవి నా చేతికిచ్చి మీరు చక్కా మీ పని పైన వెళ్లండి మీ లగేజిని సురక్షితంగా మా యిల్లు చేర్చే పూచీ నాది పని పూర్తయ్యాక మీరు నేరుగా మా యింటికొచ్చేయండి మీకోసం మా యింటి తలుపులెప్పుడూ తెరిచేవుంటాయండీ!" అన్నాడు

అతడు నాకామాట యిచ్చి పదేళ్లయింది అప్పటినుంచీ సిటీకెప్పుడు వచ్చినా నా చిరునామా మార్పులేదు — కేరాఫ్ చీమకుర్తి భవానీ శంకరం మాక్స్‌ముల్లర్ రోడ్డు, రాంకోటి

'హైద్రాబాదు నగరంలో నేను గూడా నిరాశ్రయుడినేమీ కాదండోయ్!' అని బిగ్గరగా అరిచి చెప్పాలనిపించింది కానీ కంపార్టుమెంటు అప్పటికే ఖాళీ అయిపోయింది తోటి ప్రయాణీకులందరూ ఒకరినొకరు తోసుకుంటూ గేటు వైపు వెళ్లిపోతున్నారు

*　　*　　*

రిక్షా బండి నాంపల్లి స్టేషనునుంచీ బయల్దేరి రాంకోటివైపు వెళ్తుండగా నాలో ఏదో అలజడి రొద పెట్టసాగింది ఒక మిత్రుడి మంచితనాన్ని ఎక్స్‌ప్లాయిట్ చేస్తూ నేను నా పబ్బాన్ని గడుపుకుంటున్నానేమో! అసలే భవానీశంకరంది చాలా చిన్న యిల్లు, స్టేట్‌మెంట్ తప్పయినందుకు మన్నించాలి. స్వంత యిల్లు కాదు, అది భవానీ శంకరం నివసిస్తున్న అద్దెయిల్లు ముందువైపు నుంచీ చూస్తే అది గారమిద్దెలా వుంటుంది నడవదాటి వెళ్తే కొంచెం ఖాళీ జాగా, దాని చుట్టూ పెంకుటిళ్లు కనిపిస్తాయి పావురాల గూళ్లలాంటి ఆలోగిట్లో ఎంత లేదన్నా నాలుగైదు కాపురాలు కొనసాగుతూ వుండొచ్చునని నా అనుమానం ముందువైపు గారమిద్దెలో కొంత భాగం, వెనుక వైపు పెంకుటింట్లో ఒక గది ఇంత మాత్రమే భవానీశంకరానికున్న గృహవసతి.

నడవలో నుంచీ తట్టిన వెంటనే తలుపు తెరుచుకుంటుంది భవానీ శంకరం సాధారణంగా పాత కొయ్యకుర్చీలో కూర్చుని, టేబిలు కానించి నడుములదాకా జరిపి పెట్టుకున్న అట్టపైన డ్రాయింగు పేపరు పరచుకుని గాజు బుడ్డీలోని రకరకాల కుంచెలుపయోగిస్తూ ఏదో ఒక చిత్ర రచనలో నిమగ్నుడైవుంటాడు చిత్రకారుడుగా అతనికి పేరుంది కానీ 'పేరు' తిండి పెడుతుందా? అందుకోసం అతడొక ప్రభుత్వ కార్యాలయంలో యు డి సి గా పనిచేస్తున్నారు కానీ అతడి ఆరో ప్రాణం చిత్రకళ అతడి దౌర్బల్యం ఎవరే అబ్లిగేషన్‌తో వెళ్లినా 'కాదు' అనకపోవడం భవనీశంకరం పుస్తకాలకు ముఖచిత్రాలు రూపొందిస్తాడు బ్లాకులు చేయించుకోడానికి వీలుగా స్వంత దస్తూరీతో ప్రకటన పత్రాలు, ఆహ్వాన పత్రికలు మొదలైన వాటిని తయారు చేస్తాడు ఎంబ్లమ్స్ గీస్తాడు డిజైన్లు వేసిరకరకాల వాల్‌పోస్టర్లకు నమూనాలు సిద్ధం చేస్తాడు చిన్న ఫోటోలను పెద్దచిత్రాలుగా ఎన్‌లార్జ చేస్తాడు కుంచెతో అతడు చేయగల ఇంద్రజాలాలు చాలా వున్నాయి అయితే చేసినపనికి ఎవరైనా ఏదైనా యిస్తే పుచ్చుకోడం తప్పితే నిక్కచ్చిగా అడిగి పుచ్చుకునే కూసువిద్యమాత్రం అతడికి ఒంట బట్టలేదు ఫలితమేమిటంటారేమో— ఇదిగో, హైద్రాబాదుకు వచ్చి చేరి పాతికేళ్లయినా యింకా అద్దెయింట్లోనేవుండడం!

భావానీశంకరం పుట్టిందీ, పెరిగిందీ కోనసీమ—పెళ్లాడింది విజయనగరం చిన్నపిల్లలకు పుస్తకాలు వ్రాయించడం కోసం ఒక జాతీయ సంస్థ మదరాసులో నిర్వహించిన వర్క్‌షాపులో నేను రచయితగానూ, భవానీ శంకరం చిత్రకారుడుగానూ పాల్గొన్నాము ఆ పాటి పరిచయాన్ని సులభంగా మరచిపోయి వుండొచ్చు మనుషులతో అనుబంధాలు పెంచుకోడమంటే, కొందరి కదొక బెడదగా వుంటుంది మరి కొందరు స్నేహాన్ని గొప్ప సంపదనుకుంటారు భవానీ శంకరది రెండో కేటగిరీ రాష్ట్ట విస్తృతంగా, యింకా మాట్లాడితే ప్రవాసాంధ్రుల్లోగూడా అతడికెందరో స్నేహితులున్నారు ఏ పని పైన హైద్రాబాదు వచ్చినా, వాళ్లు భవానీ శంకరాన్ని కలుసుకోకుండా వెళ్లరు తనను వెదుక్కుంటూ వెళ్లిన స్నేహితుడికి ఒక పూట భోజనం పెట్టి సత్కరించడం అతడు విధిగా పాటించే అతిథి మర్యాద అర్ధాంగి సుమిత్రగూడా అతనికి తగిన ఇల్లాలే! అతిథిని చూచినప్పుడు ఆమె ముఖంలో తరళించే ఆనందాన్ని గమనించి నేనెన్నోసార్లు ఆశ్చర్యపడ్డాను కొన్ని కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఆ యింట్లో అతిథుల సందడి మరింత ఉద్ధృతం కావడం కద్దు మృష్టాన్నం పెట్టడంతో సరిపెట్టుకోకుండా వచ్చిన వాళ్లకా దంపతులు పడకలు ఏర్పాటు చేయడముందే, అది చూచి తీరవలసిన దృశ్యం హాలును రెండు భాగాలుగా విభజించే ప్లైవుడ్ స్టాండును గూడా తీసేసి, ఆసుపత్రిలో పేషంట్లకు వేసినట్టుగా హాల్లో మంచాలు వేస్తారు దిండు గలీబులు మారుస్తారు పెట్టె అట్టడుగు నుంచీ చలువ దుప్పట్లు తీసి పడకల పైన పరుస్తారు ఇలా అతిథుల అవసరాలన్నీ గమనించిన తర్వాత ఆ యింటి గృహిణి సిరిచాప పరచుకుని తన యిద్దరు పిల్లలతోబాటుగా వంటింట్లో నిద్రపోతుంది చుట్టూరా పుస్తకాల బీరువాలున్న పెంకుటింటి గదిలో ఈజీ చేర్ వేసుకుని, భవానీశంకరం అందులోనే నిద్రపోతాడు

లోకంలో అన్నింటి కన్నా తేలికైన పని సలహాలివ్వడం! ఒకసారి నేనాపని అత్యంత సమర్థవంతంగా నిర్వహించాను "చూడండి భవానీ శంకరంగారూ! 'గెస్టు'ల రూపంలో ఎందరో 'గోస్టు'లు మిమ్మల్ని వేదిస్తూ వుండడం నేను కళ్లారా చూస్తున్న విషయం అందులో నేనూ ఒకణ్ణని సవినయంగా ఒప్పుకుంటాను మీరు మీ కోసం గాకపోయినా, మా కోసమైనా హైద్రాబాదులో మరిన్ని వసతులుండేటట్టు ఒక స్వంత ఇల్లు కట్టుకోగూడదా?"

నా అభ్యర్థనకు భవానీశంకరం మాటలతో బదులు చెప్పలేదు ఓ పొడుగాటి స్కేలును చేతికి తీసుకుని గోడవైపు చూపించాడు. అతడు నిర్దేశించిన చోట గోడకొక బొమ్మ వ్రేలాడుతూ వుంది ప్రత్యేకమైన కాగితం పైన నీటిరంగులతో వేసిన చిత్రం అది. మరీ అంత ఎత్తుగా లేని ప్రహరీ గోడల ఎదుమ, ఉన్న జాగాలో మూడింట ఒక భాగాన్ని మాత్రమే ఆక్రమిస్తున్న చిన్న మేడ దానికి రెండువైపుల మాత్రం మంగుళూరు పెంకులతో వంచిన వసారా మేడ ముంగిట వసారా పొడుగునా పూల పందిరి ఎడమవైపు నుంచీ మేడ పైకి మెట్లు డాబాపైన ఈవలా ఆవలా విశాలమైన గవాక్షాలతో రెండు పెద్ద గదులు ఆ గదుల నడుమ పూరికప్పుతో ముచ్చటైన కొట్టం మెట్లపైన నిల్చుని చూస్తే ఎదురుగా వెదురు దబ్బలతో నిర్మించిన లతా కుటీరం. ప్రహరీని అంటిపెట్టుకుని చుట్టూ కొబ్బరిచెట్లు, ఇంకా పూలమొక్కలూ, పచ్చిక జొంపాలూ వ్, ఎందుకులెండి! ఈ పొడి మాటల వర్ణన ఆ చిత్రానికి న్యాయం చేకూరుస్తుందనినేననుకోను. పరమ రమణీయమైన వర్ణ సమ్మేళనం చూచి తీరవలసిందేగానీ, మాటల్లోకి అనువదించడం సాధ్యమా? అందులోనూ నిండు పున్నమినాటి నిశిరాతిరివేళ కురిసే వెన్నెల చిక్కగా ప్రసరించే నీడలు విరిసినవ్వే పువ్వులు 'ప్రశాంతి' అనేది ఒక దైవమైతే, ఆ దైవం కొలువు దీర్చడానికి మోజుపడే చోటు బహుశా అలాంటిదే అయి వుంటుంది ఇక్కడొక మాట చెప్పాలి. నేనా చిత్రాన్ని చూడడానికదే మొదటిసారి గాదు. అయితే భవానీ శంకరం వేసిన వెయ్యి చిత్రాల్లో అదొకటని మాత్రమే అనుకున్నాను. తనఊహాలో అతడు నిర్మించుకున్న ఆదర్శ గృహమని అప్పుడే తెలిసింది


"అయితే ఈ మాత్రం ఇల్లు కట్టుకోవాలంటే నేను ముందుగా ఓ పని చెయ్యాలండీ రాజశేఖరంగారూ!" అన్నాడు భవానీ శంకరం 'ఏమిటి' అన్నట్లుగా అతడివైపు చూచాను "ఏంలేదు ఎదుగూ బొదుగూలేని ఉద్యోగాన్ని మానెయ్యాలి కనీసం లాంగ్ లీవ్ అయినా పెట్టాలి వ్యాపార చిత్రంలో దిగాలి పూర్తిగా టైమంతా దానికే డివోట్ చెయ్యాలి నాలుగు రూకలు మిగిలించాలి"

"కానీ కళను వ్యాపారంగా మార్చడం మీ చేతగాదే!" వాపోయినట్టుగా నేనన్నాను

[ఇంకా వుంది]

# ఆశ్రయం

మధురాంతకం రాజారాం



"అందుకు వేరే వున్నాడులెండి! కె. వి. మూర్తి అని నా చిన్ననాటి స్నేహితుడు. చిత్రకారుడేం గాదు. కానీ ఈ లైనులో అఖండుడు. కొంతకాలం బొంబాయిలోనూ, ఢిల్లీలోనూ వుండి వచ్చాడు. కిటుకులన్నీ అతడి చిటికెనవ్రేల్లో వుంటాయనుకోండి! ఇప్పటికొక ఆరు మాసాల నుంచీ ఈ ప్లాను అమల్లో పెట్టడం కోసం నాతో సతపోరుతున్నాడు. ఆర్డర్లు తీసుకరావడం, బిల్లులు తయారు చేయడం, డబ్బును వసూలు చేయడం అతడి పని. బొమ్మలు వేసిపెట్టడం నా పని. అంటే ఏమిటి? ఆర్ట్ నాదైతే వ్యాపారం అతనిదన్న మాట!

* * *

ఆర్జన కోసం భవానీశంకరం తన దారిని మళ్లించి నాలుగేళ్లయింది. గారమిద్దెలో యిటుచివర, రోడ్డువైపు తెరచుకునే కొట్టులాంటి గదిలో అతడానాడు చెప్పిన తతంగమంతా ప్రారంభమైపోయింది. కె. వి. మూర్తి అన్న వ్యక్తిని గూడా నేను నాలుగైదుసార్లు చూచాను. అతడు కుర్చీలో వుంటాడుగానీ, వున్నట్టే వుండడు. మాట్లాడతాడుగానీ, మాట్లాడినట్టే వుండడు. ఇక్కడుండాలిగదా అని తిరిగిచూస్తే, ఎప్పుడో మటుమాయమై వుంటాడు. అతడి జాడ — అద్దంలోకి వచ్చి వెళ్లిపోయే నీడ. వెళ్తే ఎక్కడికి వెళ్తాడో, వస్తే ఎప్పుడొస్తాడో

(గత సంచిక తరువాయి)

తెలియదు. వ్యాపార రంగంలో కార్యశూరుడైన వాడి తరహా బహుశా అలాగే వుండాలేమో! మరైతే కళాకారుడి స్థితి ఎక్కడికొచ్చి ఆగిందంటారు? భవానీశంకరం ఉదయం ఆరు గంటల కల్లా టీ త్రాగి వెళ్లి కుర్చీలో కూచుంటాడు. గంట పదైనా భోజనానికి పిలుపొస్తేగానీ అందులో నుంచీ లేవడు. భోజనం చేసిన తర్వాత వెళ్లి కూచుంటే బాగా చీకటి పడేదాకా పనిచేస్తాడు. రాత్రి భోజనానంతరమున్నా అంతే! స్కేలుతో గీతలు గియ్యడం, ఫోటోలతికించడం, బొమ్మలు వెయ్యడం, అక్షరాలు దిద్దితీర్చడం, పెన్సిళ్లు జివురుకోడం, కుంచెలు సరిచేసుకోడం — అలిసిపోయినప్పుడల్లా టీలు త్రాగడం — ఇదీ వరస! కరుణామయురాలు — నిద్రాదేవత వచ్చి కనురెప్పలపైన కూచోవాలి. ఆ కాయం మెల్లగా లేచివచ్చి మంచంపైన సోలిపోవాలి.

గడచిన పర్యాయం — అంటే ఏడాది క్రితం హైద్రాబాదు వచ్చినప్పుడు తలకుమించిన బరువుతో కొండెక్కి దిగినవాడిలా భవానీశంకరం డస్సిపోయి కనిపించాడు. కళ్లద్దాలు తీసి టేబిలుపైన పెట్టి "డాక్టరుగారితో నాకు పేచీ వచ్చిందండీ!" అన్నాడు. 'ఏమిటి' అన్నట్టుగా అతడివైపు చూచాను. "ఏంలేదు. ఒళ్లంతా సలుపులు. కళ్లు మండుతున్నాయి. ఆకలి మందగించింది మాత్రలు వేసుకుంటేగానీ నిద్ర రావడంలేదు. డాక్టరుగారు కొద్ది నెలలపాటు పని మానేసి రెస్టు తీసుకోమంటున్నారు" అన్నాడు.

రిక్షాకు బ్రేకు పడడంతో ఉలిక్కిపడి బాహ్యప్రపంచంలోకి వచ్చేశాను. "రాంకోటి చౌరస్తా యిదేనయ్యా! దిగతారా" అంటున్నాడు రిక్షావాడు.

"కాదులేవయ్యా! ఇదిగో, ఈ రోడ్డంట వెళ్లు. ఇంకొక ఫర్లాంగు దూరమే" నన్నాను.

రిక్షా ఇంటిముందర ఆగింది.

రిక్షా దిగడంతోటే గమనించాను. రోడ్డువైపు తెరచుకునే కొట్టు మూతబడి వుంది. రిక్షావాడికి డబ్బులు ముట్టజెప్పి గబ గబా నడవలోకి వెళ్లి తలుపు తట్టాను. తలుపు తీసిన వ్యక్తి అపరిచితుడు. "ఏమండీ! ఎవరు కావాలి?" — గద్దించి నట్లుగా అడిగాడు.

"భవానీ శంకరం గారని ..." అంటూ సగంలో ఆపేశాను "ఆయన కోసం వచ్చేవాళ్లకు బదులు చెప్పలేక మా ప్రాణాలు దిగిపోతున్నాయండీ బాబూ! ఆయన ఇల్లు ఖాళీచేశాడు. మేమిక్కడచేరి ఆరునెలలయింది" అంటూ అతడు దభేలున తలుపు మూసి గడియ పెట్టుకున్నాడు.

* * *

గుడ్డిలో మెల్లగా అప్పుడు నా దగ్గర పెద్ద లగేజీ ఏమీలేదు. సంచీ భుజానికి తగిలించుకుని రోడ్డున పడ్డాను. ఎలాగైనా ఒకరాత్రి వేగిస్తే, రేపటి సాయంకాలం నేను హైద్రాబాదు నుంచీ

వెళ్ళిపోవచ్చు. అదేమంత పెద్ద సమస్య గాదు. కానీ ఆ లోపల భవానీశంకరం ఆచూకీ తెలుసుకోగలిగితే బాగుండును...ఇప్పుడతని ఆరోగ్యం ఎలా వుంది? ఎంతో దీక్షగా అతడు నిర్వహిస్తూ వచ్చిన చిత్రాల ఖార్ఖానా ఎందుకు మూతబడింది?

ఏ వైపుగా వెళ్తున్నానో, ఎందుకు వెళ్తున్నానో తెలియకుండా నేనొక రోడ్డు వెంట నడుస్తున్నాను. మధ్యలో ఒక హోటలు కనిపిస్తే అందులోకి వెళ్ళి ఉపాహారం తీసుకున్నాను. హోటలు గదులకన్నా హోటళ్ళే నయం. ఎంతసేపు కూచున్నా అద్దె చెల్లించమని అడగరు. ఆ మాటకొస్తే నగరాల్లో థియేటర్లయితే మరింత మేలు! మూడు రూపాయలు చెల్లిస్తే వాళ్ళ మెత్తనిసీట్లో, చల్లటి గాలి క్రింద మూడు గంటలసేపు కూచోనిస్తారు. చాలని దానికి సినిమాగూడా చూపిస్తారు. యాథృచ్ఛికంగానైతేనేమి, నాకు మంచి ఉపాయమే స్ఫురించింది. మధ్యాహ్నం భోజనంచేసి ఏద్దైనా మాట్నీకి వెళ్తాను. రాత్రికింక ఎటూ తప్పదు గనుక లాడ్జిలో రూము తీసుకుంటాను.

కాఫీ సేవిస్తూ కిటికీగుండా వెలుపలికి చూచాను, ఇండ్ల పైకప్పుల మీదినుంచీ కొంత దూరంలో చింతచెట్ల చిటారు కొమ్మలు కనిపించాయి. కుర్చీని కిటికీకి దగ్గరగా జరుపుకున్నాను. సందేహంలేదు. అది గడచిన సంవత్సరం హైద్రాబాదు వచ్చినప్పుడు నన్ను భవానీశంకరం సిటీబస్సెక్కించి సాగనంపిన చోటు. బస్‌స్టాపుకెదురుగా రోడ్డు కటువైపున అంతస్తుకు నాలుగు వాటాలు చొప్పున, అయిదంతస్తుల బ్లాకులుగా నిర్మించిన కట్టడాలు యాభై అరవై దాకా కానవస్తాయి. కాలం ఆకాశంలో భాగమని ఐన్‌స్టైయిన్ కాబోలు అన్నాడంటారు. కాలప్రభావంవల్ల నేలపైన తావులేక మానవుడు ఆకాశంలోకి చొచ్చుకపోతున్నట్టున్నాడు. మంచిదే. ఆకాశమైనా కనిపించని అంతర్మధ్యంలో నివసిస్తున్న మానవులపట్ల మనకు సానుభూతిగూడా వుండనివ్వండి. తప్పులేదు. కానీ రోడ్డుకీవల చింతచెట్లక్రింద చింకిపాతలతో, గోనెసంచులతో, డబ్బారేకులతో వేసుకున్న పాకల్లో జీవిస్తున్న మనుషుల మాటేమిటి? మండుటెండలు కాచినా, వడగాడ్పులు వీచినా, జడివానలు కురిసినా, చలిగాలులు విసిరినా వీళ్ళకు రక్షణ ఏముంది? దుమ్ములో కూచుంటారు. పేవ్‌మెంట్లపైన పడుకుంటారు. భవనాలుగా సౌధాలుగా, ప్రాసాదాలుగా, గృహాలుగా, ఇళ్ళుగా పేర్కొనబడే వందలకొలది, వేలకొలది, లక్షల కొలది కట్టడాల నడుమ దప్పికతో గొంతు ఎండుకపోతున్నా త్రాగడానికి నీళ్ళులేక సముద్రంవైపు బిక్కరించి చూచే నిర్భాగ్య జీవుల్లా — వీళ్ళు జీవిస్తారు.

ఎట్టయెదుట కనిపిస్తున్న ఆ బృహత్ — సౌధాలను చూచి బహుశా భవానీశంకరం బాగా ఉత్తేజం పొందినట్టున్నాడు. బస్‌స్టాపులో నిల్చున్న పది నిమిషాలలోనూ నాతో చాలా విషయాలు చెప్పేశాడు.


“ఏమిటో అనుకున్నానుగానీ రాజశేఖరం గారూ, ఇప్పుడు నేను చేస్తున్న పనిగూడా నాకు అచ్చివచ్చేటట్టు లేదండీ! మునుపు 'జాబ్' చేస్తుంటే నెలనెలా వెయ్యి రూపాయలు చేతికొస్తుండేది. ఉదయం, సాయంకాలం రెండేసి గంటలు పనిచేస్తే నా ఆర్ట్‌వల్ల నాకు నాలుగైదు వందలదాకా ముట్టేవి. ఇప్పుడంతకు మించిన సంపాదనేమీ కళ్ల జూడడంలేదు. దీనివల్ల కొని తెచ్చుకున్నది అనారోగ్యం మాత్రమే. సరే, ఆ సంగతలా వుంచండి. ఇప్పుడు నా పీకలు నొక్కేస్తూ వున్నది గృహ సమస్య. ఇరవైయేళ్ల క్రితం కొత్తగా చేరినప్పుడు నేనిస్తూ వచ్చిన ఇంటద్దె నూటపాతిక. అది నూటయాభై అయింది. రెండు వందలయింది. వేలంపాటలో నేను మూడు వందల దాకా నెగ్గుతూ వచ్చాను. ఇప్పటి కయిదేళ్లనుంచీ మూడువందలే యిస్తూ వస్తున్నాను. కానీ మా యింటి ఓనరున్నాడే, ఆశాపాతకుడు. సిటీలో అతనికి పది పన్నెండు ఇళ్ళున్నాయి. వాటిపైన పీల్చి పీడించి వసూలు చేసుకునే అద్దె డబ్బులే పెట్టుబడిగా అతడు నాచారంలో నాలుగెకరాలు కొంటాడు. ఎర్రగడ్డలో ఏడెకరాలు కొంటాడు. ఇంకా మాట్లాడితే బొలారందాకా వెళ్లి అక్కడ తొండలు గుడ్లుపెట్టే బంజరునేల ఏదయినా వుంటే దాన్నీ కొనేస్తాడు. ఈ మహానగరం కబంధుడు హస్తాలు చాచినట్టుగా విస్తరిస్తూ వెళ్తుందన్న రహస్యం అతడికి తెలిసినట్టు మరొకరికి తెలియదు. అదనూ, పదనూ కూడా కలిసివచ్చే సమయం కోసం పొంచివుండి అతడు కొన్న నేలపైన గీతలు వేయించి, రాళ్ళు నాటిస్తాడు. అంతేనండీ సంగతులు! అతడింక చేయవలసిందల్లా, ఆ బాతులు పెట్టే బంగారు గుడ్లు ఏరుకోవడమే! ఆ మహానుభావుడి కోపవీక్షణాలు మూడేళ్ళుగా నన్ను వెంటాడుతున్నాయి. అయిదు వందలిస్తావా, చస్తావా అన్నాడు. నేనివ్వనని మొరాయించాను. అతడు కోర్టుకెక్కాడు. ఇప్పటి కయిదు వాయిదాలు పడ్డాయి. ఎంత మొండికేసినా నేనీయింటిని ఎప్పుడోఒకప్పుడు ఖాళీ చెయ్యక తప్పదు. దీన్ని ఖాళీచేస్తే స్వంత యింటికే వెళ్లాలన్నది నా ప్రయత్నం. అందుకని నేనొక ప్లాను వేశాను. నా భార్య దగ్గర పది సవరన్ల బంగారముంది. దాన్నమ్మేస్తే ఎంత లేదన్నా పన్నెండు వేలొస్తుంది. మా తోడల్లుడొకాయన వున్నాడు. అగ్రికల్చరల్ డిపార్టుమెంటులో పెద్ద ఆఫీసరు. ఆయనకిప్పుడే నేను కొంత డబ్బివ్వాలి. అయినా యింకొక అయిదు వేలయినా ఆయన యిస్తాడు. నాగరాజని ఒక ప్రాణస్నేహితుడున్నాడు లెండి! అతడెప్పుడు కావలిస్తే అప్పుడు పదివేలివ్వడానికి సిద్ధంగా వున్నాడు. ఈ పాతికవేలు పెట్టి నేను సిటీలో ఎక్కడైనా ఒక పాత యిల్లే కొంటాను. బ్యాంకుల్లో నాకు చాలా మంది మిత్రులున్నారు. పాతయింటిని తనఖా క్రింద పెట్టించి, వాళ్ళు నాకెలాగైనా యాభైవేలదాకా బ్యాంకు లోను యిప్పిస్తారు. కొంచెం కొంచెంగా మార్పులతో, చేర్పులతో నివాసయోగ్యంగా మలుచుకోవాలనుకోండి! అదేమంత కష్టంగాదు ...”


భవానీశంకరం వేసుకున్న ప్లానును గురించి నా అభిప్రాయమేమిటో నేను చెప్పలేదు. ఆలోగా బస్సొచ్చేసింది. కానీ యిప్పుడా పాతసంగతులన్నీ మననం చేసుకుంటూ వుండే చీకటింటిలోకి ఒక కాంతి కిరణం చొచ్చుకుని వచ్చినట్టుగా నాలో ఒక కొత్త ఊహ ననలెత్తింది. ఏమో, అలా ఎందుకు జరిగి వుండకూడదు? భవానీశంకరం ఆలోచన ఫలించే వుండొచ్చు. హైద్రాబాద్‌లో తనకంటూ ఒక స్వంత యిల్లు ఏర్పాటు చేసుకునే వుండొచ్చు ...

భవానీశంకరం గురించిన తలపు లంతటితో కట్టిపెట్టి, నేనారోజు మధ్యాహ్నం మ్యాట్నీకి వెళ్ళిపోయాను. థియేటరులోనుంచీ వెలుపలికి వచ్చి, పబ్లిక్ గార్డెన్స్‌వైపు నడుస్తుండగా పొద్దుపోయింది. రవీంద్ర భారతిని సమీపించేసరికి కళాభవన్ మెట్లపైన ఎక్కుతూ, దిగుతూ చాలా మంది కనిపించారు. వాకబుచేయగా పై అంతస్థులో చిత్రకళా ప్రదర్శనం ఏర్పాటు చేసినట్టు తెలిసింది. 'చిత్రకళ' అనగానే నాకు భవానీశంకరం జ్ఞప్తికి రావడం సహజం. అతడు ప్రదర్శనంలో వుంటాడని కాదుగానీ, కొంత కాలక్షేపమైనా అవుతుంది గదా అని పైకి వెళ్లాను. పొడుగాటి హాల్లో చాలా బొమ్మలు కనిపించాయి. చిత్రపరీక్ష రత్న పరీక్షకన్నా కఠినమని ఒక కళాకోవిదుడు రాసిన మాట ఎక్కడో చదివాను. ఆ కళను గురించి నాకు తెలిసింది చాలా తక్కువ. అయినా యిప్పుడేమయింది? నేనేమీ ఆ బొమ్మలకు వెలగట్టవలసింది లేదు గదా! కంటికి యింపైనవాటిని చూస్తూ ముందుకు సాగిపోతున్నవాణ్ణి, తలపైన పెద్ద మేకొకటి దిగ్గొట్టినట్టుగా ఒకచోట హఠాత్తుగా ఆగిపోయాను. అప్పుడక్కడ నా కంటికెదురుగా కనిపిస్తున్నది వట్టి చిత్రంగాదు. అది మా భవానీశంకరం కన్న రంగులకల! ఊహలో నిర్మించి కాగితం పైకి దింపిన రమణీయ ప్రశాంతి మందిరం. నిర్వాహకులు దానికొక కాగితంముక్కగూడా అతికించారు. ఆ చిత్రం విలువ నాలుగు వందలా యాభై రూపాయలట! ఆ డబ్బు చెల్లించి ఎవడైనా దాన్ని ప్యాక్ చేయించి చక్కా తమ యింటికి తీసువెళ్లి పోవచ్చునట!

“నాకు ఏడుపొచ్చింది. ఎవరైనా దాన్ని కొనుక్కుని వెళ్లిపోతారని మాత్రమేగాదు; నా దగ్గర అంత డబ్బు లేనందుకు గూడా!

ప్రదర్శనలో నా కాలింక ముందుకు సాగలేదు. గిరుక్కున వెనుదిరిగి క్రిందికి దిగి వచ్చేశాను.






# ఆశ్రయం

నేలమట్టం నుంచీ రోడ్డుదాకా వేసిన సోపానాలు దిగబోతున్నాను. పైకి రావడం కోసం క్రిందిమెట్టు పైన కాలు పెట్టిన భవానీ శంకరం నన్ను చూచి, అక్కడే ఆగిపోయాడు.

అతడు పైకి రాలేదు. నేనే క్రిందికి దిగాను.

అతడు నా చేయి పట్టుకున్నాడు. అప్పటి కదే పలకరింపు.

ఎక్కడకని నే నడగలేదు. అతడు నన్ను పబ్లిక్ గార్డెన్స్ లోపలికి తీసుకెళ్లాడు. దట్టంగా చీకట్లు క్రమ్ముకున్న ఓ చెట్టు క్రింద కూర్చున్నాము.

తేలిగ్గా సంభాషణ జరుపుకోడానికి వీల్లేకుండా గుండెల పైన పెద్ద బరువేదో మోపినట్టుంది.

ఆఖరుకు భవానీ శంకరమే పెదవి కదిపాడు.

"అంతా తల్లక్రిందులైపోయింది లెండి రాజశేఖరంగారూ! చేబట్టిన వ్యాసంగంలో నాకు సమాన భాగస్వామ్యముంటుందని నే నమకున్నాను. మూర్తి అలా అనుకోలేదు. అతడు నన్ను కేవలం 'ఎంప్లాయి'గానే లెక్కగట్టేశాడు. నెల నెలా ఉదారంగా జీతం యిస్తున్నాను గదా—అన్నాడు. జీతం యిచ్చిన మాట నిజమే! సిటీలో తల మాసిన ఆర్టిస్టులకేం కొదవ? అలాంటి వాళ్లను నలుగుర్ని పట్టుకుని 'కోఠీ' దగ్గర కార్యాలయం తెరిచి యిప్పుడు బ్రహ్మాండంగా బిజినెస్ నడుపుకుంటున్నాడు. నేను మాత్రం మళ్లీ నా పాత ఉద్యోగంలోనే చేరిపోయాను ..."

"మరైతే యిప్పుడు మీరెక్కడున్నారు?— గొంతుకలో కొట్టుమిట్టాడుతున్న ప్రశ్నను వెళ్లగక్కేశాను.

"వేరే అద్దె యిల్లు దొరికిందిలెండి! విజయవాడకు వెళ్లే ట్రంకురోడ్డు పైన వెళ్లాలి. ఉండడం హైదరాబాదులోనే! కానీ ఆ యిల్లు విజయవాడకే దగ్గరేమో! ఏమండీ రాజశేఖరం గారూ! మీరిక మీదట మా యింటికి రాలేరా?"

భవానీ శంకరం కళ్లు చెమ్మగిల్లిందీ, లేనిదీ ఆ చిమ్మచీకట్లో నాకు కనిపించలేదు. హైదరాబాదుకే చెందినప్పటికి విజయవాడకే సమీపమనిపించే అతడి నివాసానికి నేను వెళ్లగలిగానా, లేదా అన్నదికూడా ముఖ్యమైన విషయం కాదు. రెక్కలకు దెబ్బతగిలి, దూరంగా వెళ్లలేని భ్రమరంలా నా మనసు ఎగ్జిబిషన్‌లో చోటుచేసుకొన్న భవానీశంకరం చిత్రం చుట్టే తిరుగుతూ వుంది. ఆ చిత్రాన్ని కొనుక్కోగలిగినవాడు అదృష్టవంతుడు. అందులో వున్నట్టుగా నివాసగృహాన్ని నిర్మించుకోగలిగినవాడు యింకా యింకా గొప్ప అదృష్టవంతుడు. అయితే ఇది అదృష్టవంతుల్ని గురించిన కథగాదు. ★